manachourasta

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 01 | సంచిక : 222 | మంగళవారం | 11.02.2025




# ఇలాగైతే విధులకు వెళ్లేదెలా!

## శిథిలావస్థలో ఆరోగ్య ఉప కేంద్రం



**పాలకుర్తి, మన చౌరాస్తా :** జనగామ జిల్లా పాలకుర్తి మండలం ఈరవెన్ను ప్రాథమిక ఆరోగ్య ఉప కేంద్రం పూర్తిగా శిథిలా వ్యవస్థకు చేరింది. దశాబ్దాల క్రితం నిర్మించిన ఈ భవంతికి పగుళ్లు ఏర్పడి క్రమంగా పెచ్చులుడుతున్నాయి. గోడలు కూడా పగుళ్లతో కూలేందుకు సిద్ధంగా ఉన్నాయి. అయినా ఈ భవనంలోనే పల్లె దవాఖానా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నిర్వహిస్తున్నారు. క్షేత్రస్థాయి ఆరోగ్య సిబ్బంది విధులకు వెళ్లడానికి జంకుతున్నారు. ఇటీవల తృటిలో ఓ పెను ప్రమాదం తప్పింది. టీకాల సమయంలో పైపెచ్చు ఊడి కిందకు పడడంతో గర్భిణులు, బాలింతలు భయాందోళనకు గురవతున్నారు. ఇప్పటికైనా అధికారులు, పాలకులు నూతన భవన నిర్మాణంపై దృష్టి పెట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు. మూడేళ్ల క్రితం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం భవన నిర్మాణానికి ప్రభుత్వం నిధులు కేటాయించింది. కానీ అప్పట్లో సరిపడా స్థలం లేక నిర్మాణ పనులు ముందుకు అడుగు పడలేదు. ప్రస్తుతం రెవెన్యూ అధికారులు కూడా ఉన్న భవనాన్ని కొలతలతో నిర్ధారించడంతో ఈ స్థలంలోనే నిర్మాణం చేపట్టొచ్చని అనుమతి ఇచ్చారు. మరి ఈసారైనా భవన నిర్మాణ పనులు ముందుకు సాగుతాయో లేదో వేచి చూడాల్సిందే.






### జాతర ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

- కలెక్టర్ రిజ్వాన్ బాషా

2



### కడవెండిలో సినిమా షూటింగ్

- క్లాప్ కొట్టిన ఎమ్మెల్యే యశస్విని రెడ్డి

3



### కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం

- మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఇందిర

3

General News




# మహా శివరాత్రి జాతరపై సమీక్ష

పాలకుర్తి, మన చౌరాస్తా : జనగామ జిల్లా పాలకుర్తిలోని శ్రీసోమేశ్వర లక్ష్మీనరసింహ ఆలయంలో ఈనెల 25 నుంచి నిర్వహించే మహా శివరాత్రి జాతర నేపథ్యంలో సోమవారం ఎమ్మెల్యే మామిడాల యశస్విని రెడ్డి, కలెక్టర్ రిజ్వాన్ భాషా దేవాదాయ ప్రాంగణంలో సమీక్ష నిర్వహించారు. కీలక శాఖల అధికారులతో మాట్లాడి జాతరను విజయవంతం చేసేలా కృషి అందరూ సమష్టిగా పని చేయాలన్నారు. పారిశుద్ధ్యం, విద్యుత్ సరఫరా నిరంతరంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే, కలెక్టర్ సమక్షంలో ఈ సమావేశంలో అధికారులు, సిబ్బంది జాతర ఏర్పాట్ల పై చేపట్టే పనులను వివరించారు. అనంతరం ఎమ్మెల్యే ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.



## మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం

**పాలకుర్తి, మన చౌరాస్తా:** జనగామ జిల్లా పాలకుర్తిలోని సాంఘిక సంక్షేమ వసతి గృహాన్ని కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ సోమవారం ఆకస్మికంగా సందర్శించారు. కలెక్టర్ విద్యార్థులతో మాట్లాడారు. భోజనం రుచిగా ఉంటున్నదా, మెనూ ప్రకారం పెడుతున్నారా అని అడిగి తెలుసుకున్నారు. పరీక్షలు సమయం సమీపిస్తున్నందున అందరూ తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. స్టడీ మెటీరియల్ అందిస్తామని, ఛాలెంజింగ్ గా చదవాలన్నారు. పట్టుదలతో 10/10 సాధించాలన్నారు. కలెక్టర్ వెంట అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్, ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ శ్రీనివాస్ ఉన్నారు.



# ‘శ్రీగాయత్రి’లో ‘క్రియేటివ్ స్పార్క్స్’

**హైదరాబాద్, మన చౌరాస్తా :** హైదరాబాద్ మణికొండలోని శ్రీ గాయత్రి ఈ టెక్నో స్కూల్‌లో ‘క్రియేటివ్ స్పార్క్స్’ పేరుతో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. ప్రాథమిక తరగతులు చదువుతున్న విద్యార్థుల్లో చురుకుదనం, సృజనాత్మకతను పెంచడమే లక్ష్యంగా ఈ వినూత్న కార్యక్రమం నిర్వహించినట్లు పాఠశాల యాజమాన్యం తెలిపింది. ఈ కార్యక్రమంలో విద్యార్థులతో పాటు.. విద్యార్థుల తల్లిదండ్రులు కూడా ఉత్సాహంగా పాల్గొన్నారు. క్రియేటివ్ స్పార్క్స్ లో భాగంగా పలువురు విద్యార్థులు మెహెందీ, బెస్ట్ ఔట్ ఆఫ్ వేస్ట్, పోస్టర్ మేకింగ్, ఫ్లేమ్ లెస్ కుక్కింగ్, హెల్దీ డ్రింక్స్ వంటివి ప్రదర్శించడంలో చిన్నారులు ఉత్సాహం చూపించారు. ఇప్పుడున్న ఫాస్ట్ ఫుడ్ జనరేషన్‌లో ఆరోగ్యకరమైన ఆహారపదార్థాలను ఎంచుకోవడం, హెల్దీ ఫుడ్స్ మాత్రమే తినాలన్న అలవాట్లను నేర్పించడం.. తద్వారా ఆరోగ్యాన్ని కాపాడుకోవడం పట్ల అవగాహన పెంచడానికి తమ పాఠశాలలో చదువుతున్న విద్యార్థులనే భాగస్వామ్యం చేశామని శ్రీగాయత్రి స్కూల్ యాజమాన్యం తెలిపింది. తమ పాఠశాల విద్యార్థులు చదువులోనే కాకుండా.. అన్ని రంగాలలోను ముందుండేలా ఇలాంటి స్పెషల్ ఈవెంట్స్ నిర్వహిస్తున్నామని చెప్పారు. ఈ ప్రదర్శనను తిలకించడానికి వచ్చిన తల్లిదండ్రులు చిన్నారుల ఆసక్తి, ఉత్సాహానికి మురిసిపోయారు. కనులవిందుగా జరిగిన ఈ క్రియేటివ్ స్పార్క్స్ కార్యక్రమంలో పాఠశాల చైర్మన్ మధుసూదన్, సీఈఓ సర్వేశ్వర రావు, ప్రధానోపాధ్యాయురాలు రచన పటేల్ తదితరులు పాల్గొన్నారు.








# కాంగ్రెస్ మోసాలను వివరించాలి

- **స్థానిక ఎన్నికల్లో గెలుపే లక్ష్యంగా పనిచేయాలి**

**జనగామ, మన చౌరాస్తా :** అధికార కాంగ్రెస్ పార్టీ చేస్తున్న మోసాలను గడపగడపకు వెళ్లి వివరించాలని బీఆర్ఎస్ క్లస్టర్ ఇన్‌చార్జీలు పిలుపునిచ్చారు. జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్ రెడ్డి ఆదేశాల మేరకు క్లస్టర్ ఇంచార్జీలు మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి ప్రేమలత రెడ్డి, కౌన్సిలర్లు పేర్ని స్వరూప, అనిత, మాజీ మార్కెట్ డైరెక్టర్ సెవెల్లి మధు, యూత్ ప్రెసిడెంట్ ఉల్లెంగుల సందీప్ సోమవారం జనగామ మండలంలోని అడవికేశవపూర్, పెద్దతండా (ఎం )గ్రామాల్లో గ్రామాల్లో నాయకులు, కార్యకర్తలతో సన్నహాక సమావేశాలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బీఆర్ఎస్ పార్టీ చేసిన అభివృద్ధిని ప్రజలకు వివరించడంతో పాటు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీ లను నెరవేర్చకుండా కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న మోసాలను ఎండగట్టాలన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ అత్యధిక స్థానాలు సాధించేలా కార్యకర్తలు కృషి చేయాలని తెలిపారు.

# సూర్య నమస్కారాల్లో ప్రథమ బహుమతి




**బచ్చన్నపేట, మన చౌరస్తా :** సిద్దిపేటలో జరిగిన శత సహస్ర సూర్య నమస్కారాలు రాష్ట్రస్థాయి పోటీ లలో అండర్ 25 విభాగంలో బచ్చన్నపేట మండలం, ఆలింపూర్ గ్రామానికి చెందిన హాసిని 1232 రౌండ్స్ సూర్య నమస్కారాలు చేసి రాష్ట్రస్థాయి ప్రథమ బహుమతి గెలుపొందింది.11 ఏళ్ళ ఉన్న ఈ బాలిక సిద్దిపేట కేంద్ర విద్యాలయంలో ఆరవ తరగతి చదువుతున్నది. తల్లిదండ్రులు భార్గవి గణేష్ తండ్రి ప్రభుత్వ ఉపాధ్యాయుడు మరోవైపు యోగా శిక్షకుడిగా రాణిస్తూ తను కూడా పోటీలలో పాల్గొని 760 రౌండ్లు సూర్య నమస్కారాలు చేసి రాష్ట్ర స్థాయి 10వ స్థానంలో నిలిచారు. తండ్రీ కూతురు ఇద్దరు రాష్ట్రస్థాయి పోటీల్లో రెండు మార్లు ముందంజలో నిలిచారు. అంతర్జాతీయ స్థాయిలో రాణించడం తన లక్ష్యమని హాసిని వివరించారు.ఈ సందర్భంగా ఆలింపూర్ మాజీ ఎంపిటిసి మొహమ్మద్ మసూద్, కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షుడు జ్యోతి భాస్కర్, కొడవటూరు దేవస్థానం కమిటీ డైరెక్టర్ మంతపూర్ రాములు, గ్రామ శాఖ అధ్యక్షులు పాకాల కర్ణాకర్, పెదపాటి కరుణాకర్ రెడ్డి, ఎండి నజీర్, పారుపల్లి పరమేశ్వర్, గ్రామస్తులు తండ్రి కూతురును అభినందించారు.

# శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** రాబోవు గ్రామపంచాయతీ ఎన్నికల సందర్భంగా గ్రామాల్లో ఎలాంటి శాంతి భద్రతల సమస్యలు తలెత్తకుండా చూడాలని హుస్నాబాద్ ఏసీపి సతీష్ గ్రామస్తులకు సూచించారు. మండలంలోని పోతిరెడ్డిపల్లి గ్రామంలో సోమవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల సమయంలో ప్రతి ఒక్కరూ కలిసిమెలిసి ఉంటూ ఎన్నికల్లో పాల్గొనాలని అన్నారు. గ్రామంలో ప్రజల రక్షణ నిమిత్తం సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవడానికి పోలీస్ శాఖకు సహకరించాలని సూచించారు. గ్రామంలో ఎవరైనా అనుమానస్పదంగా కనబడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని అవసరమైతే 100 నెంబర్ కు ఫోన్ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో చేర్యాల సిఐ శ్రీను, ఎస్సై నీరేష్ పోలీస్ సిబ్బంది, గ్రామస్తులు పాల్గొన్నారు.

Local News

# కాంగ్రెస్ ప్రభుత్వంలో మహిళలకు ప్రాధాన్యం

- **జిల్లా మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు బడికే ఇందిర**

**జనగామ, మన చౌరాస్తా :** కాంగ్రెస్ ప్రభుత్వం మహిళల అభివృద్ధికి ఎంతో కృషి చేస్తుందని మహిళా కాంగ్రెస్ జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిర అన్నారు. మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు సునీతా రావు, జనగామ డీసీసీ అధ్యక్షుడు కొమ్మూరి ప్రతాప్ రెడ్డి ఆదేశాల మేరకు జిల్లా అధ్యక్షురాలు బడికె ఇందిరా అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశంలో రాష్ట్ర ఉపాధ్యక్షురాలు సుకన్యతో కలిసి పాల్గొని మాట్లాడారు. మహిళా కాంగ్రెస్ ను బలపరుస్తూ ప్రతి మహిళకు రేవంత్ రెడ్డి ప్రతిష్టాత్మకంగా అమలుపరిచిన పథకాలను వారికి వివరించే విధంగా పనిచేయాలని కోరారు. రాబోయే స్థానిక ఎన్నికలల్లో మహిళలు రాణించాలని కోరారు. మహిళా కాంగ్రెస్ ను బలోపేతం చేయడానికి అందరూ సహకరించాలని, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు పరచిన పథకాలను ప్రతి గ్రామంలో ప్రచారం చేయాలన్నారు. కార్యక్రమంలో మహిళా కాంగ్రెస్ రాష్ట్ర కార్యదర్శి పిన్నింటి కావ్య శ్రీ రెడ్డి, బుఱెడ్డి శ్రీలత రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షురాలు మున్నీ బేగం, జిల్లా సెక్రెటరీ సక్కుబాయి, పట్టణ అధ్యక్షురాలు శ్రీలత, జక్కుల రేణుక, పాలకుర్తి మహిళా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వడ్లకొండ తారా, బచన్నపేట మండల అధ్యక్షురాలు భాగ్యలక్ష్మి, మాజీ కౌన్సిలర్ వేమళ్ల పద్మ, వార్డు అధ్యక్షురాలు ఉమ మహేశ్వరి, దేవేంద్ర, సుమతీ, ఉమా, రజియా, నవ్య శ్రీ, లక్ష్మి, కౌసల్య పాల్గొన్నారు.






## మహిళలకు సన్మానం

మహిళా కాంగ్రెస్ సభ్యత్వాలు చేసి పదవులు పొందిన మహిళా నాయకురాలకు వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బనుక శివరాజ్, డైరెక్టర్లు నామాల శ్రీను, భన్సీ నాయక్ సన్మానించారు.



# ఎన్‌సీసీ జనగామ కమిటీ ఎన్నిక

**జనగామ, మన చౌరాస్తా :** నేషనల్ క్రిస్టియన్ కౌన్సిల్ (ఎన్‌సీసీ) జనగామ జిల్లా కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా రాజ కుమార్ రోడ్రిక్స్, ప్రధాన కార్యదర్శి రమావత్ జోసెఫ్, కోశాధికారి గా ప్రీతి దయాల్‌ను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ క్రైస్తవులపై జరుగుతున్న దాడులు, వ్యతిరేకతలను అడ్డుకునేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. తమపై నమ్మకంతో అప్పగించిన బాధ్యతను శక్తి వంచన లేకుండా నిర్వర్తిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ స్టేట్ ప్రెసిడెంట్ బిషప్ మద్దెల సంజయ్ ఆనంద్, తెలంగాణ స్టేట్ జనరల్ సెక్రటరీ బక్క ఎలియా తదితరులు పాల్గొన్నారు.





# 108 వాహనం తనిఖీ

**బచ్చన్నపేట, మన చౌరస్తా :** మండలానికి కేటాయించిన 108 అంబులెన్స్ ను నల్గొండ క్లస్టర్ ప్రోగ్రాం మేనేజర్ నసిరుద్దీన్, మరియు జనగామ జిల్లా మేనేజర్ మంద శ్రీనివాస్ తనిఖీ చేశారు. సందర్భంగా అంబులెన్స్ పరికరాలను వాటి పనితీరును పరిశీలించి, అత్యవసర సమయంలో వినియోగించే పరికరాల పనితీరును, సంబంధించిన రికార్డులను పరిశీలించారు. రోడ్ ఆక్సిడెంట్లు, గర్భిణీలు, పాముకాటు వంటి అత్యవసర పరిస్థితుల్లోనూ 108 అంబులెన్సులను మండల ప్రజలు వినియోగించుకోవాలన్నారు. ప్రజలకు ఎల్లవేళల సేవ చేయాలని సిబ్బందికి సూచించారు.మరియు వేసవి కాలంలో రాబోయే ఎండ వేడి మరియు డీహైడ్రేషన్ గురించి తగిన సూచనలు సలహాలు తెలియజేశారు. మండలంలోని అన్ని గ్రామాల ప్రజలు వినియోగించుకోవాలి అని తగినటువంటి ఓఆర్ఎస్ ప్యాకెట్లు మరియు ఐస్ ప్యాకెట్లు అందుబాటులో ఉంచుకోవాలని సూచించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ఈఎంటి శిరీష మరియు పైలెట్ సురేష్‌లకు వివరించారు.



# కడవెండిలో సినిమా షూటింగ్

**పాలకుర్తి, (దేవరుప్పుల) మన చౌరాస్తా :** జనగామ జిల్లా దేవురుప్పల మండలం కడవెండి గ్రామంలో దొడ్డి కొమురయ్య జీవితాన్ని ఆధారంగా చేసుకుని ఓ సినిమా రూపొందిస్తున్నారు. సోమవారం సినిమా ప్రారంభోత్సవ కార్యక్రమానికి పాలకుర్తి శాసన సభ్యురాలు యశస్వినిరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై క్లాప్ కొట్టి షూటింగ్‌ను ప్రారంభించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. దొడ్డి కొమురయ్య త్యాగాలు, తెలంగాణ సాయుధ పోరాటంలో ఆయన పాత్ర కీలకమన్నారు. 1946 జూలై 4న కడవెండిలో భూస్వాముల అన్యాయాలకు వ్యతిరేకంగా జరిగిన పోరాటంలో ఆయన ప్రాణాలు కోల్పోయారన్నారు. ఈ సంఘటన తెలంగాణ సాయుధ పోరాటానికి నాంది పలికిందన్నారు. ఈ సినిమాతో దొడ్డి జీవితం, ఆయన పోరాట స్ఫూర్తి కొత్త తరాలకు చేరువ కానుందన్నారు. సాయుధ పోరాటంలో ఆయన చేసిన సేవలను స్మరించుకోవడానికి ఈ చిత్రం ఒక మంచి అవకాశం అన్నారు. మండల నాయకులు, పార్టీ సీనియర్ నాయకులు, యువజన నాయకులు, మహిళ నాయకులు, చిత్ర యూనిట్ సభ్యులు పాల్గొన్నారు.

# కుక్కలను నివారించాలి



**కొమురవెల్లి, మన చౌరాస్తా :** కొమురవెల్లి మండల కేంద్రంలో వీధి కుక్కల దాడిలో వద్దూరి శ్రీనిద్ అనే బాలుడు తీవ్రంగా గాయపడిన సంఘటన ఆదివారం చోటు చేసుకుంది. ఒక్కసారిగా వీధి కుక్కలు దాడి చేయడంతో బాలుడికి గాయాలు కాగా చికిత్స నిమిత్తం సిద్దిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ప్రస్తుతం బాలుని పరిస్థితి నిలకడగా ఉంది. అయితే గ్రామంలో వీధి కుక్కలు, పందుల స్వైర విహారం ఎక్కువగా ఉందని వెంటనే నివారణ చర్యలు చేపట్టాలని కోరుతూ గ్రామ యువత ఆధ్వర్యంలో సోమవారం కారోబార్ కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గ్రామ యువత నాయకుడు ఏర్పుల మహేష్ మాట్లాడుతూ ఎన్నిసార్లు వీధి కుక్కలు పందుల విషయంలో ఇలాంటి ఘటనలు జరుగుతున్న అధికారులు పట్టించుకోవడం లేదని అన్నారు. ఇప్పటికైనా స్పందించి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. యువత నాయకులు గొల్లపల్లి ఆంజనేయులు, గజ్జె అశోక్, ఏర్పుల శ్రీనివాస్, సనాది కరుణాకర్, పొట్ల చెరువు బాబు, కొయ్యడ సంజీవులు, ఎక్కలదేవి వినయ్, సార్ల వినయ్, బైరి హరీష్, గుండా మహేష్, దొడ్ల ప్రవీణ్, నరేష్ పాల్గొన్నారు.



# కుంభమేళాలో క్రేజీ హీరోయిన్..

ప్రపంచంలోనే అతి పెద్ద ఆధ్యాత్మిక వేడుకగా పేరొందిన ప్రయాగ్ రాజ్ మహా కుంభమేళా అప్రతిహతంగా కొనసాగుతోంది. జనవరి 13న ప్రారంభమైన ఈ వేడుక ఈ నెల 26 వరకు జరగనుంది. 144 సంవత్సరాలకు ఒక్కసారి జరిగే ఈ మహా కుంభమేళాకు దేశ విదేశాల నుంచి కోట్లాది మంది భక్తులు తరలివస్తున్నారు. కుటుంబ సభ్యులు, బంధువులు, స్నేహితులతో కలిసి పవిత్ర త్రివేణి సంగమంలో పుణ్య స్నానాలు ఆచరిస్తున్నారు. కేవలం సామాన్యులే కాదు సినీ, క్రీడా, రాజకీయ ప్రముఖులు కూడా మహా కుంభమేళాలో భాగమవుతున్నారు. ప్రధానంగా సినీ తారలు పెద్ద ఎత్తున ఈ ఆధ్యాత్మిక వేడుకలో భాగమవుతున్నారు. విజయ్ దేవరకొండ, హేమ మాలినీ, సంయుక్త మేనన్, యాంకర్ లాస్య, బింధుమాధవి, శ్రీనిధి శెట్టి, పూనం పాండే, పవిత్ర గౌడ, బిగ్ బాస్ ప్రియాంక జైన్, దిగంగన సూర్య వంశీ, రాజ్ కుమార్ రావు తదితర సినీ ప్రముఖులు కుంభమేళాలో పవిత్ర స్నానాలు ఆచరించారు. తాజాగా ప్రముఖ హీరోయిన్ సోనాల్ చౌహాన్ మహా కుంభమేళాను దర్శించుకుంది. సోమవారం సంప్రదాయ దుస్తులు ధరించి త్రివేణి సంగమంలో పవిత్ర స్నానాలు ఆచరించింది. అనంతరం తన ఆధ్యాత్మిక యాత్రకు సంబంధించిన ఫోటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. దీంతో అవి కొద్ది క్షణాల్లోనే వైరల్ గా మారాయి.పేరకు బాలీవుడ్ నటి అయినా సోనాల్ చౌహాన్ తెలుగు ఆడియన్స్ కి చాలా సుపరిచితం. రెయిన్ బో సినిమాతో తెలుగు తెరకు పరిచయమైన అమ్మడు లెజెండ్, డిక్టేటర్, రూలర్ సినిమాల్లో బాలకృష్ణ తో కలిసి స్ర్కీన్ షేర్ చేసుకుంది. అలాగే పండగ చేస్కో, షేర్, ఎఫ్3, ది ఘోస్ట్, ఆది పురుష్ తదితర సినిమాల్లోనూ కీలక పాత్రలు పోషించింది. అయితే క్రేజ్ మాత్రం తెచ్చుకోలేకపోయింది. ప్రస్తుతం ఈ ముద్దుగుమ్మ హిందీ సినిమాల్లో నటిస్తోంది.



# టైమ్ కు రాకపోతే చర్యలు

## - వరంగల్ డీఎంహెచ్ వో డాక్టర్ బి సాంబశివరావు



**వరంగల్ , మన చౌరాస్తా :** సమయపాలన పాటించని ఉద్యోగులపై చర్యలు ఉంటాయని వరంగల్ డీఎంహెచ్ వో డాక్టర్ బి సాంబశివరావు తెలిపారు. డీఎంహెచ్ వో డాక్టర్ బి సాంబశివరావు బానోజీపేట ప్రాథమిక ఆరోగ్య కేంద్రం , టీ హబ్, పైలిటీ కేర్ సెంటర్లలో పర్యటించి వైద్య సిబ్బంది ప్రజలకు అందించవలసిన సేవల గురించి, సమయపాలన గురించి వివరించారు. ప్రభుత్వం నిర్దేశించిన లక్ష్యాలను చేరుకోవాలని మాతా శిశు సంరక్షణ, ప్రభుత్వ హాస్పిటల్ లో డెలివరీలు, వ్యాధి నిరోధక టీకాలు, అందించాలని కోరారు. సంక్రమిత వ్యాధులు, అసంక్రమిత వ్యాధులు నిర్ధారణ పరీక్షలు చేయించి తగు చికిత్సలు అందించాలని తెలిపారు. ప్రజలు వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది సూచనలు పాటిస్తూ ఆరోగ్యంగా ఉండడానికి ప్రయత్నం చేయాలని తెలిపారు. ఏమైనా ఆరోగ్య సమస్యలు వచ్చినట్లయితే వెంటనే సిబ్బంది ద్వారా తగు చికిత్సలు తీసుకోవాలని కోరారు. మహిళా ఆరోగ్య క్లినిక్ లు, ఆరోగ్య కేంద్రాలు ప్రజల ఆరోగ్య అవసరాలకు నిర్మించారు కాబట్టి సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు నాణ్యమైన ఆరోగ్య సేవలు అందించాలన్నారు. వైద్యాధికారులు , సిబ్బందితో సమీక్షించి ప్రజలకు అందించవలసిన సేవల గురించి సిబ్బంది విధుల గురించి తగిన సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పీహెచ్ సీ వైద్యాధికారులు డాక్టర్ అరుణ్ కుమార్ , డాక్టర్ శ్రవణ్ కుమార్ , డెమో అనిల్ కుమార్, టీ హబ్ సిబ్బంది , పలేటివ్ కేర్ సెంటర్ సిబ్బంది , పీహెచ్ సీ సిబ్బంది పాల్గొన్నారు.



# ఘనంగా బబ్బూరి బర్త్ డే వేడుకలు

**జనగామ , మన చౌరాస్తా :** జనగామ జిల్లా బీఆర్ఎస్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ జన్మదినం సందర్భంగా హైదరాబాద్ నాదర్గుల్ లో గల మాతృదేవోభావ అనాధ ఆశ్రమంలో 150 మంది అభాగ్యులకు అన్నదానం చేశారు. తన జన్మదినం సందర్భంగా సోమవారం హైదరాబాద్ లోని రాష్ట్ర మాజీ మంత్రి , సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్ రావు ని కలిసి ఆశీర్వాదం తీసుకున్నారు. ఈ సందర్భంగా హరీష్ రావు గారు శాలువతో సత్కరించి, కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు.



# ఏసీబీ వలలో పీఆర్ ఏఈ

**వరంగల్ , మన చౌరాస్తా :** ఇంటి నిర్మాణం అనుమతి కోసం లంచం తీసుకుంటూ పంచాయతీ రాజ్ ఏఈ ఏసీబీకి పట్టుబడ్డాడు. వివరాల్లోకి వెళ్తే..వరంగల్ జిల్లా సంగెం మండలం కుంటపల్లి గ్రామానికి చెందిన ఓ వ్యక్తి తన ఇంటి నిర్మాణం అనుమతి కోసం మండలానికి చెందిన పీఆర్ ఏఈ రమేష్‌ను కలిశాడు. అందుకు ఏఈ రూ.10వేలు లంచం డిమాండ్ చేశాడు. చేసేదేమి లేక సదరు బాధితుడు ఏసీబీ అధికారులను ఆశ్రయించాడు. వారి సూచనల మేరకు సోమవారం హనుమకొండ సుబేదారిలో ఏఈ తన ప్రైవేట్ కార్యాలయంలో ప్రైవేటు అసిస్టెంట్ అయిన గుగులోత్ సారయ్య ద్వారా బాధితుడి నుంచి రూ. 10వేలు లంచం తీసుకుంటుండగా ఏసీబీ అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. నిందితుడిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.




## ఎమ్మెల్సీగా దేవిదాస్

# నామినేషన్

**కరీంనగర్ , మన చౌరాస్తా :** మెదక్, కరీంనగర్, నిజామాబాద్, అదిలాబాద్ జిల్లాల గ్రాడ్యుయేట్ ఎమ్మెల్సీ స్థానానికి సీనియర్ జర్నలిస్టు పులగం దేవిదాస్ సోమవారం కరీంనగర్ జిల్లా కలెక్టరేట్ లో జిల్లా రిటర్నింగ్ అధికారిని పమేలా సత్పతి కి నామినేషన్ సమర్పించారు. సామాజిక అంశాలపై అవగాహన ఉన్న ఒక సీనియర్ జర్నలిస్టుకు అవకాశం ఇవ్వాలని , ఎమ్మెల్సీగా పోటీ చేస్తున్న తనకు మద్దతు తెలపాలని దేవిదాస్ కోరారు. ఎమ్మెల్సీ స్థానానికి నామినేషన్ వేసిన దేవి దాస్ కు నిజామాబాద్, అదిలాబాద్ జర్నలిస్టులు శుభాకాంక్షలు తెలిపారు.

WANTED విలేకరులు కావలెను



www.manachourasta.com
మన చౌరాస్తా
The Complete News way




'మన చౌరాస్తా' తెలుగు దిన పత్రికలో పనిచేసేందుకు జిల్లా స్టాఫర్లు, కంట్రీబ్యూటర్లు కావలెను. తెలుగు భాషపై పూర్తి స్థాయిలో పట్టు.. సమకాలీన రాజకీయాలు, సామాజిక అంశాలపై అవగాహన ఉండి.. రాయగల వారికి 'మన చౌరాస్తా' సాదర స్వాగతం పలుకుతోంది.

సెల్ : 9676400812